E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :284 మంగళవారం 22 సెప్టెంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## ఒకే టికెట్.. మూడు ప్రయాణాలు!

- అన్ని ప్రయాణాలకు కామన్ టికెట్
- మెట్రో, ఎంఎంటీఎస్, బస్సులు ఒక్కటే
- వారం రోజుల్లో అందుబాటులోకి
- ఓలా, ఉబర్, ర్యాపిడో అనుసంధానం
- రియల్‌టైమ్ డేటాతో స్మార్ట్ ప్రయాణం
- మొబైల్ యాప్‌తో టికెట్ బుకింగ్
- లాస్ట్ మైల్ కనెక్టివిటీకి ప్రాధాన్యం
- స్టేషన్--వారీ అనుసంధాన ప్రణాళికలు




## ప్రాణం తీసిన 10 రూ

- మాటామాటా పెరిగి దాడి
- ఆటో డ్రైవర్ ముఖ్రం మృతి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- అజీమ్, షోయబ్‌పై అనుమానాలు
- ఘటనపై పోలీసుల దర్యాప్తు
- నిందితుల అరెస్టుపై స్పష్టత లేదు
- పెట్రోలింగ్ పెంచాలని ఎమ్మెల్యే డిమాండ్

2 లో

## బీఆర్ఎస్‌పై కడియం సంచలన వ్యాఖ్యలు!

- బీఆర్ఎస్ నేతలపై అవినీతి సొమ్ము ఆరోపణలు
- కల్వకుంట్ల కుటుంబ ఆస్తులపై కడియం కీలక ప్రశ్నలు
- ఎకరం లేని వారికి వందల ఎకరాలు ఎలా వచ్చాయంటూ నిలదీత
- తెలంగాణ అభివృద్ధిని బీజేపీ అడ్డుకుంటోందని విమర్శలు
- బీజేపీ మళ్లీ గెలిస్తే ప్రజల బతుకులు ఆగమేనని వ్యాఖ్య
- పేదల కోసం కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలన్న కడియం
- బీఆర్ఎస్ హయాంలో ఆస్తుల పెరుగుదలపై కడియం ప్రశ్నలు
- కాంగ్రెస్ పాలనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ మండిపాటు

2 లో

# దానం పిటిషన్‌పై సుప్రీం విచారణ



**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** దానం నాగేందర్ అనర్హత వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం రోజున విచారణ చేపట్టనుంది. ఈ మేరకు దానం నాగేందర్ తరఫు న్యాయవాది సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రోహత్గి పిటిషన్‌ను సుప్రీంకోర్టులో మెన్షన్ చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం రోజున విచారణ జరపనుంది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు.

దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు.

మిగతాది 2 లో..

- సుప్రీంకోర్టుకు దానం పరుగులు
- హైకోర్టు తీర్పుపై స్టే పిటిషన్
- బుధవారం సుప్రీంలో విచారణ
- స్పీకర్ ఉత్తర్వులు రద్దు
- దానంను అనర్హుడిగా ప్రకటించిన కోర్టు
- ఖైరతాబాద్ సీటు ఖాళీగా ఆదేశం
- ఉపఎన్నికపై దానం లాయర్ వాదన
- కేవియట్లతో ప్రతివాదుల అడ్డుకట్టు
- ఫైట్ చేస్తా.. గెలుస్తా: దానం

## కుప్పమే నా పునర్జన్మ

- రూ.289 కోట్ల ప్రాజెక్టులకు భూమిపూజ
- భూగర్భ యుటిలిటీలకు రూ.184 కోట్లు
- బిరుగనిపల్లె రిజర్వాయర్‌కు రూ.68 కోట్లు
- రాయలసీమను ఎడారిగా కానివ్వం
- 40 ఏళ్ల అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం
- 'స్వర్ణ కుప్పం' లక్ష్యమన్న చంద్రబాబు
- రైతుల ఆదాయం పెంపుపై ప్రత్యేక ఫోకస్




**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన రూ. 38 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, రూ. 289 కోట్ల విలువైన ప్రాజెక్టులకు భూమిపూజ నిర్వహించారు. కుప్పంలో రూ. 184 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ యుటిలిటీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే ఆర్డీఓ, ఏఎస్పీ కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రూ. 3.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంటును, మెటీరియల్ రికవరీ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

## బాలికపై దారుణం.. నిందితుడి అరెస్ట్!




**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** దేశ రాజధాని ఢిల్లీలోని సదర్ బజార్ ప్రాంతంలో అత్యంత దారుణమైన సంఘటన వెలుగుచూసింది. ఓ దుకాణంలో 10 ఏళ్ల ఆరో తరగతి విద్యార్థిని కాళ్లు, చేతులు కట్టేసి ఒక వ్యక్తి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

## హీటెక్కిన ఫామ్‌హౌస్ రాజకీయం

- ఫామ్‌హౌస్‌లపై కాంగ్రెస్ దూకుడు
- బీఆర్ఎస్ నేతల భూములపై ఆరోపణలు
- క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పర్యటనలు
- పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ సందర్శన
- అత్యవసర భేటీకి కేటీఆర్, హరీశ్
- కాంగ్రెస్‌కు కౌంటర్ వ్యూహంపై చర్చ
- ప్రజాక్షేత్రంలో తేల్చుకునే యోచన
- దానం అనర్హతపైనా కీలక చర్చ




**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య పొలిటికల్ వార్ రోజురోజుకీ ముదురుతోంది. ఫామ్‌హౌస్ పర్యటనలతో రెండు పార్టీల మధ్య నడుస్తున్న రాజకీయం తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. బీఆర్ఎస్ నాయకులు గత పదేళ్ల పాలనలో భారీగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చేపడుతున్న పర్యటనలు, బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు నేతృత్వంలో తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ ముఖ్యనేతలు అత్యవసరంగా సమావేశమయ్యారు.

## అఖిలేశ్‌కు ఒవైసీ ఓపెన్ ఆఫర్!




- బీజేపీని అడ్డుకోవడమే లక్ష్యమన్న ఒవైసీ
- యూపీ విపక్షాలకు ఒవైసీ బహిరంగ పొత్తు ప్రతిపాదన
- అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు
- ఎంఐఎంతో చేతులు కలపాలని రాజకీయ పార్టీలకు పిలుపు
- విపక్ష ఓట్లు చీలకుండా కలిసిరావాలన్న సూచన
- ఒవైసీ ఆఫర్‌పై యూపీలో రాజకీయ చర్చ
- సమాజ్‌వాదీ, కాంగ్రెస్ స్పందనపై ఆసక్తి

## తప్పు చేసినవారికి శిక్ష తప్పదు!




- డీఎస్సీ అక్రమాలపై సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్
- నిరసనకారులపై లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండించిన సజ్జల
- ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ విమర్శలు
- టెట్ పాస్ కానివారికి ఉద్యోగాలిచ్చారని ఆరోపణ
- స్పోర్ట్స్ కోటాలో అనర్హులకు ఉద్యోగాలంటూ ఆరోపణలు
- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు సజ్జల డిమాండ్
- అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్న డిమాండ్

## ఖైరతాబాద్ బరిలో తలసాని తనయుడు?

- బీఆర్ఎస్‌లో అభ్యర్థిపై కసరత్తు
- సాయి కిరణ్ వైపు మొగ్గు
- మన్నె గోవర్ధన్ రెడ్డి పేరు
- విష్ణువర్ధన్ రెడ్డికి ఛాన్స్
- తలసాని భరోసాతో పెరిగిన ఆశలు
- షెడ్యూల్ తర్వాతే తుది నిర్ణయం
- సర్వే ఆధారంగా అభ్యర్థి ఎంపిక




**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక అనివార్యమైతే ... అభ్యర్థిగా ఎవరిని బరిలో దించాలనే దానిపై రాజకీయ పార్టీలు కసరత్తు తీవ్రతరం చేశాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి పోటీ ఇచ్చేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేదానిపై ఆసక్తి నెలకొంది. 2018, 2023 రెండు ఎన్నికల్లోనూ దానం నాగేందరే బీఆర్ఎస్ నుంచి పోటీ చేశారు. దీంతో అక్కడి కేడర్ ఆయనకు అటాచ్ అయి ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆయన కాంగ్రెస్‌లో చేరి లోక్‌సభకు పోటీ చేశారు. నాటి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎవరవుతారనే దానిపై చర్చ నడిచింది.

ప్రస్తుతం ఉపఎన్నిక వస్తే ప్రధానంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు తలసాని సాయి కిరణ్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు మన్నె గోవర్ధన్‌రెడ్డి, పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి పేర్లను పరిశీలిస్తున్నట్టుగా సమాచారం.

## గణేష్ ఊరేగింపులో మాంసం కలకలం!

- మాదన్నపేటలో మాంసం వ్యర్థాలతో కలకలం
- నిమజ్జనం వేళ ఉద్రిక్త వాతావరణం
- పై అంతస్తుల నుంచి విసిరిన వైనం
- భక్తులు, స్థానికుల తీవ్ర నిరసన
- రంగంలోకి దిగిన పోలీసు బృందాలు
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- కఠిన సెక్షన్ల కింద కేసులు

2 లో

# కుప్పమే నా పునర్జన్మ

మొదటి పేజీ తరువాయి

అలాగే మానసరోవర్ గ్లోబల్ యూనివర్సిటీలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు రైతు బజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 10 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న మల్లనూర్ జూనియర్ కాలేజీ పనులకు భూమిపూజ నిర్వహించారు. వ్యవసాయ ఫీడర్ల కోసం ఉద్దేశించిన 15 మెగావాట్ల పీఎం-కుసుం సౌర విద్యుత్ ప్రాజెక్టులను సీఎం ఈ సందర్భంగా ప్రారంభించారు.

బిరుగనిపల్లె రిజర్వాయర్ కోసం..

నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కింద బిరుగనిపల్లె రిజర్వాయర్ కోసం నిధులను పెంచుతూ రూ. 68 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి, ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. దీనితో పాటు మదనపల్లె, యామిగానిపల్లె వద్ద కూడా రిజర్వాయర్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. శ్రీశైలం నుంచి 660 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పానికి నీళ్లను తీసుకువచ్చామని, ఇది ఆచరణ సాధ్యం కాదనుకున్నవారు ఆశ్చర్యపడేలా చేసి చూపించామని గుర్తుచేశారు. కనీస నీటి ఎద్దడి లేకుండా రిజర్వాయర్లలో నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, రాయలసీమను ఎడారిగా కానివ్వకూడదనే ఉద్దేశంతోనే ఆనాడు ఎన్టీఆర్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

40 ఏళ్ల సుదీర్ఘ ఎమ్మెల్యేను నేను.. : బహిరంగ సభలో కుప్పం ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సీఎం తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కుప్పం ప్రజలతో తనది రాజకీయ సంబంధం కాదని, ప్రేమానురాగాలు ఉన్న కుటుంబ అనుబంధమని పేర్కొన్నారు. కుప్పంలో ప్రతి ఇంట్లో తన్ను తమ కుటుంబ సభ్యుడిలా చూస్తారని, ప్రజలు 40 ఏళ్లపాటు సుదీర్ఘంగా తనను ఎమ్మెల్యేగా గెలిపించారని కృతజ్ఞతలు తెలిపారు. నారావారిపల్లి తనకు జన్మనిస్తే, రాజకీయంగా పునర్జన్మనిచ్చింది మాత్రం కుప్పమేనని, అందుకే కుప్పం ప్రజలు ఎప్పుడూ తన మనసుకు చాలా దగ్గరగా ఉంటారని అన్నారు.

నియోజకవర్గాన్ని మోడల్ కుప్పంగా మార్చేందుకు స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎక్కడ ఏ మంచి పని చేయాలన్నా తానూ కుప్పం నుంచే ప్రారంభిస్తానని తెలిపారు. హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా టూరిజాన్ని ఆకర్షిస్తామని, రూ. 2.5 కోట్ల వ్యయంతో మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించి, ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇచ్చి "స్వర్ణ కుప్పం" సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

రైతుల ఆదాయాన్ని పెంచాలి

వాతావరణంలో అసమతుల్యత వల్ల వర్షాలు పడితే కుంభవృష్టి, లేకపోతే అనావృష్టి వస్తోందని, ఎల్ నినో లాంటి పరిస్థితులను ఎదుర్కొంటూనే రైతుల ఆదాయం పెంచుకునే మార్గాలను ఆలోచించాలని కోరారు. క్రిమిసంహారక మందులు లేకుండా ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా 32 రకాల విత్తనాలను పీడీఎంఎస్ (ఆాణమీా) కింద అంతటా చల్లేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేశామని, అవసరమైతే రాష్ట్రమంతా తిరిగి రైతుల్లో చైతన్యం తెచ్చి ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ప్రకృతి సేద్యంలో నమూనాగా మారుస్తానని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు కుప్పంలో రోజుకు 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఉపాధి అవకాశాలు పెంచేందుకు 200 మంది యువత మరియు రైతులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఇప్పటికే కుప్పంలో 8,732 మంది డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మార్చామని, అభివృద్ధితోనే కుప్పం నియోజకవర్గం సమగ్ర మోడల్‌గా మారుతుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

# హీటెక్కిన ఫామ్‌హౌస్ రాజకీయం

మొదటి పేజీ తరువాయి

ఫామ్‌హౌస్ లీడర్లే టార్గెట్‌గా కాంగ్రెస్ 'టాస్క్':

అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ నేతల భూములపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణల అనంతరం బీఆర్ఎస్ అగ్రనేతలకు సంబంధించిన ఫామ్‌హౌస్‌లు, భూముల అంశాలను కాంగ్రెస్ నేతలు ప్రస్తావిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటనలు చేపట్టారు. ఇందులో భాగంగా కేటీఆర్, హరీశ్ రావు, కేటీఆర్ ఫామ్ హౌస్ ల పర్యటనలు చేశారు. ఇక మొన్నటి వరకు బీఆర్ఎస్ అగ్రనేతలపై దృష్టి సారించిన కాంగ్రెస్ బృందం పార్టీలోని ఫామ్ హౌస్ లీడర్లే టార్గెట్?గా రాజకీయం సాగిస్తున్నారు. ఈక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ ను సైతం సందర్శించారు. ఈ పర్యటనలతో బీఆర్ఎస్ నేతల ఆస్తులు, భూములపై కాంగ్రెస్ నేతలు పలు ఆరోపణలు చేశారు.

బీఆర్ఎస్ అత్యవసర సమావేశం:

ఫామ్ హౌస్ పర్యటనలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై బీఆర్ఎస్ అత్యవసరంగా సమావేశం అయింది. ఈ మేరకు ఇవాళ ఉదయం కేటీఆర్, హరీశ్ రావు తెలంగాణ భవన్ కు చేరుకుని ఆ పార్టీ నేతలతో తమ భవిష్యత్ కార్యాచరణపై వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ ఫామ్ హౌస్ పర్యటనలకు కౌంటర్ ఎటాక్ కు స్కెచ్ వేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే అసెంబ్లీలో తమ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడంతో సభ వేదికగా నిలదీసే అవకాశం కోల్పోయామని భావిస్తున్న బీఆర్ఎస్.. ఇప్పుడు నేరుగా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం ఈ సమావేశంలో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పార్టీ ఫిరాయించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు ఇచ్చిన అనర్హత వేటు విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఒకవైపు కాంగ్రెస్ దూకుడుగా ఫామ్‌హౌస్ పర్యటనలు కొనసాగిస్తుంటే మరోవైపు బీఆర్ఎస్ దానికి వ్యూహాత్మకంగా చెక్ పెట్టేందుకు సిద్ధమవుతుండటంతో తెలంగాణ రాజకీయం మరింత హీటెక్కుతోంది.

# బాలికపై దారుణం.. నిందితుడి అరెస్ట్!

మొదటి పేజీ తరువాయి

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు ఒక ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. నోట్‌బుక్, పెన్ వంటి స్టేషనరీ వస్తువులను కొనుగోలు చేయడానికి బయటకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. బాధిత బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై అత్యాచారం, పోక్సో చట్టం, కిడ్నాప్ కేసు కింద పలు తీవ్రమైన సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు పాల్పడిన 56 ఏళ్ల నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలు మైనర్ కావడంతో చట్టపరమైన నిబంధనల ప్రకారం ఆమె వివరాలను పోలీసులు వెల్లడించలేదు. ప్రస్తుతం ఈ కేసుపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

# అఖిలేశ్‌కు ఒవైసీ ఓపెన్ ఆఫర్!



**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** ఉత్తరప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీని (బీజేపీ) మూడోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ను పరోక్షంగా లక్ష్యంగా చేసుకుంటూనే, రాష్ట్రంలోని విపక్షాలకు ఆయన బహిరంగంగా పొత్తు ప్రతిపాదన (ఓపెన్ ఆఫర్) చేశారు. యూపీలో బీజేపీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని తాము కూడా కోరుకోవడం లేదని ఒవైసీ స్పష్టం చేశారు. కమలం పార్టీని నిలువరించాలనే నిజమైన చిత్తశుద్ధి విపక్షాలకు ఉంటే, తమతో కలిసి రావాలని రాజకీయ పక్షాలకు పిలుపునిచ్చారు.

బీజేపీ అధికారాన్ని అడ్డుకోవడానికి ఏఐఎంఐఎంతో చేతులు కలపాల్సిందిగా ఆయా పార్టీలు, రాజకీయ మిత్రులకు స్పష్టం చేశామని ఒవైసీ పేర్కొన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా ఒకే తాటిపైకి రావాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఒవైసీ చేసిన ఈ తాజా ప్రతిపాదన ఉత్తరప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్ష ఇండియా కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు ఒవైసీ ఆఫర్‌పై ఎలా స్పందిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

# హైదరాబాద్‌కు కామన్ టికెట్!




**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** హైదరాబాద్‌లోని ఎంఎంటీఎస్ రైలు, మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సు సేవలను పరస్పరం అనుసంధానిస్తూ సమగ్ర ప్రజా రవాణా వ్యవస్థను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమన్వయ ప్రణాళికను రూపొందించింది. ఎంఎంటీఎస్, మెట్రోరైలు, బస్సులకు సంబంధించి కామన్ టికెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు మొదటి--చివరి మైలు కనెక్టివిటీని మెరుగుపరచడం, రహదారి రద్దీని తగ్గించడం, ప్రజా రవాణా వినియోగాన్ని పెంపొందించడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. అయితే ఎంఎంటీఎస్, మెట్రోరైలు, బస్సులకు సంబంధించిన కామన్ టికెట్ రెడీ చేశారు. దీనికి సంబంధించిన సాఫ్ట్‌వేర్, మొదటి, చివరి కనెక్టివిటీలో భాగంగా ప్రయివేటు రవాణా మార్గాలైన ఓలా, ఉబర్, ర్యాపిడోలతో అనుసంధానం చేయడానికి కసరత2మైల్ కనెక్టివిటీ ప్రాధాన్యత ఇస్తామని ప్రస్తావించారు. కానీ మెట్రోరైలు ప్రాజెక్టు, ఎల్ అండ్ టీ సంస్థ దీన్ని ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయింది. దీంతోపాటు అసలు ఎంఎంటీఎస్, మెట్రోరైలు, ఆర్టీసీ బస్సులకు ఎలాంటి అనుసంధానం చేయలేదు. కామన్ టికెటింగ్ వ్యవస్థ ఏర్పాటు నేపథ్యంలో లాస్ట్ మైల్ కనెక్టివిటీకి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంఎంటీఎస్ స్టేషన్ల నుంచి సమీప కాలనీలకు ప్రైవేట్ ఫీడర్ సేవలు (షేర్డ్ వాన్లు/షటిల్‌లు) ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఇవి నిర్ణీత జోన్లలో పనిచేసి, జీపీఎస్ ద్వారా పర్యవేక్షించబడతాయి ప్రతి ఎంఎంటీఎస్ స్టేషన్‌కు సమీపంలోని బస్‌స్టాప్‌లు, మార్గాలను మ్యాపింగ్ చేసి స్టేషన్--వారీ అనుసంధాన ప్రణాళికను రూపొందించాలని టీజీఎస్ఆర్టీసీ, జీహెచ్ఎంసీలకు సూచించారు.

త్వరలోనే అందుబాటులోకి..

కామన్ టికెటింగ్ వ్యవస్థను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు. కామన్ టికెట్‌కు సంబంధించి మెట్రోరైలు, ఆర్టీసీ, జీహెచ్ఎంసీ అధికారులను అన్ని ఏర్పాట్లను చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి సమయం కోసం ఎదురుచూస్తున్నారు. వారం రోజుల్లో కామన్ టికెట్‌ను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

# గణేష్ ఊరేగింపులో మాంసం కలకలం!




**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** హైదరాబాద్ లోని పాతబస్తీ మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదివారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. 2 బీహెచ్‌కే పోలీస్ హౌసింగ్ సొసైటీ వద్ద గణేష్ నిమజ్జన ఊరేగింపుతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతున్న సమయంలో, సదరు హౌసింగ్ సొసైటీ పై అంతస్తుల నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బీఫ్ లాంటి మాంసాహార వ్యర్థాలను కిందకు విసిరారు. ఈ దుశ్చర్యతో తీవ్ర ఆగ్రహానికి గురైన స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే నేతృత్వంలోని పోలీస్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి.

ఈ ఘటనకు సంబంధించి అదే హౌసింగ్ సొసైటీలో నివాసముంటున్న మహమ్మద్ ఇమ్రాన్ ఖురేషీ, అర్షియా బేగం, సమీనా అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు తక్షణమే అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై అత్యంత కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని డీసీపీ కిరణ్ ఖరే స్పష్టం చేశారు. ఆందోళనకారులతో, కాలనీ వాసులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించామని, ప్రస్తుతం ఆ ప్రాంతంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ట్రాఫిక్ రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయని, ఎలాంటి వదంతులనూ నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఖైరతాబాద్ బరిలో తలసాని తనయుడు?

మొదటి పేజీ తరువాయి


ఖైరతాబాద్ స్థానానికి అప్పట్లోనే ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ అంచనా వేసింది. హడావుడి చేసింది. ఆ ఉద్దేశంతో, అంచనాలతో పార్టీ కీలక నేతలు మన్నె గోవర్ధన్ రెడ్డిని ఉప ఎన్నిక వస్తే బరిలో దిగాల్సి వస్తుందని, సిద్ధంగా ఉండాలని చెప్పినట్టుగా అప్పట్లో పార్టీ నాయకులు బహిరంగంగానే చెప్పారు. మన్నె తన ఏర్పాట్లు చేసుకున్నారు.

తలసాని భరోసా..

దానం సభ్యత్వంపై హైకోర్టు, సుప్రీంకోర్టు కేసులు, స్పీకర్ తీర్పు ఇలా జాప్యం అవుతూ వచ్చింది. దీంతో రాజకీయ వాతావరణం మారింది. తాజాగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఉప ఎన్నిక వస్తే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు తలసాని సాయికిరణ్ యాదవ్‌ను బరిలో దింపాలని కారు పార్టీ కీలక నేతలు నిర్ణయం తీసుకున్నట్టుగా తెలిసింది. తన కొడుక్కు టిక్కెట్టు ఇస్తే ఉప ఎన్నిక వ్యవహారాన్ని అంతా తాను చూసుకుంటానని, తనకున్న రాజకీయ పరిచయాలు, సామాజికవర్గ బలం, పార్టీ కేడర్‌తో పరిచయాలు, కాంగ్రెస్‌ను ఢీకొట్టే సత్తా, బలం తనకు ఉందని, అందరినీ కలుపుకొనిపోతానని, శ్రీనివాస్ యాదవ్ పార్టీ నేతలకు చెప్పడంతో ఆయన వైపే పార్టీ పెద్దలు మొగ్గు చూపినట్టుగా తెలిసింది.

ఆయనకు టికెట్‌పై భరోసా ఇచ్చినట్టుగా తెలిసింది. అయితే ఎన్నికల షెడ్యూల్ వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటామని, అవసరమైతే సర్వే నిర్వహించి అభ్యర్థిని నిర్ణయిస్తామని చెప్పినట్టుగా సమాచారం. రాజకీయంగా తన కొడుకును స్థిరపర్చాలనే పట్టుదలతో ఉన్న తలసాని.. ఏదో ఒక నియోజకవర్గం నుంచి బరిలో దించాలనే పట్టుదలతో ఉన్నట్టుగా సమాచారం. ఖైరతాబాద్‌లో అధికార పార్టీని ఢీ కొట్టాలంటే అన్ని రకాలుగా సమఉజ్జీ ఉండాలనే ఉద్దేశంతో తలసాని వైపు పార్టీ మొగ్గు చూపుతున్నట్టుగా సమాచారం. ఒకవేళ వీలుకాకపోతే పీజేఆర్ కుమారుడు విష్ణు కానీ, గోవర్ధన్ రెడ్డి కి కానీ టికెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

# బీఆర్ఎస్‌పై కడియం సంచలన వ్యాఖ్యలు!



**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు నిత్యం విష ప్రచారం చేస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల అధికార కాలంలో సంపాదించిన అవినీతి సొమ్ముతోనే ప్రస్తుతం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. హనుమకొండ పర్యటనలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతల అక్రమాస్తులపై కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. 2014లో కనీసం ఒక్క ఎకరం కూడా లేనివాళ్లకు ఇప్పుడు వందల ఎకరాలు, వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని కల్వకుంట్ల ఫ్యామిలీని ఆయన నిలదీశారు. ఆ భూములు, ఆస్తులు ఎప్పుడు, ఎలా సంపాదించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

బీజేపీ తీరుపై తీవ్ర విమర్శలు..

మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధిని బీజేపీ అడుగడుగునా అడ్డుకుంటోందని ఆరోపించారు. ఒకవేళ బీజేపీ మళ్లీ గెలిస్తే ప్రజల బ్రతుకులు ఆగం అవుతాయని హెచ్చరించారు. పేదల జీవితాల్లో నిజమైన వెలుగులు రావాలంటే రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కడియం శ్రీహరి స్పష్టం చేశారు.

# తప్పు చేసినవారికి శిక్ష తప్పదు!

**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** అబద్ధం, దుర్మార్గం, క్రూరత్వాన్ని కలగలిపితేనే వెన్నుపోటు పార్టీ అని, రాష్ట్రంలో పాలన తీరు అలాగే ఉందంటూ వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అక్రమ విధానాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అభ్యర్థులు, ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులపై లాఠీచార్జ్ చేయించడాన్ని తీవ్రంగా ఆయన ఖండించారు. ప్రశ్నించే హక్కు ఉన్న వారిపై దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టడం ద్వారా ప్రభుత్వం తాము చేసిన తప్పులను, నిజాలను దాచలేదని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతాయుతంగా సమాధానం చెప్పాల్సింది పోయి, దౌర్జన్యాలతో గొంతు నొక్కాలని చూడటం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. డీఎస్సీ ఎంపిక ప్రక్రియలో జరిగిన భారీ అక్రమాలను సజ్జల రామకృష్ణారెడ్డి ఎండగట్టారు. కనీసం అర్హత పరీక్ష అయిన టెట్ కూడా పాస్ కాని వ్యక్తులకు నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా కింద ఏమాత్రం అర్హత లేని అనర్హులకు జాబ్స్ కేటాయించారని మండిపడ్డారు. ఈ అవకతవకలకు సంబంధించి రోజుకో కొత్త ఆధారం బయటపడుతున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎంతో కష్టపడి చదివిన అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరగాలంటే, ఈ మొత్తం డీఎస్సీ అక్రమాలపై తక్షణమే సీబీఐ చేత నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, నిజాయితీగా జరిగి ఉంటే ప్రభుత్వం విచారణ ఎదుర్కొనడానికి ఎందుకు భయపడుతోందో సమాధానం చెప్పాలని సజ్జల సవాల్ విసిరారు. రాత్రింబవళ్లు కష్టపడి పరీక్ష రాసిన ప్రతి నిరుద్యోగ ఉద్యోగార్థి ఈ అన్యాయాన్ని నిలదీసి ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. మెరిట్ ఉన్న ఏ ఒక్క అర్హత కలిగిన అభ్యర్థికీ ఉద్యోగ అవకాశం దక్కకుండా పోకూడదని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలని ఆకాంక్షించారు. విద్యా వ్యవస్థను, నిరుద్యోగుల భవిష్యత్తును నాశనం చేస్తూ ఈ అక్రమాలకు పాల్పడిన ఎంతటివారినైనా వదలకుండా చట్టరీత్యా కఠినంగా శిక్షించాల్సిందేనని సజ్జల తేల్చిచెప్పారు.

# ప్రాణం తీసిన 10 రూ



**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** హైదరాబాద్ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టేపల్లిలో జరిగిన ఓ దారుణమైన ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. కేవలం పది రూపాయల చిల్లర విషయంలో జరిగిన గొడవ, ఒక ఆటో డ్రైవర్ ప్రాణాలనే తీసేసింది. అసలు ఏం జరిగిందంటే.. వట్టేపల్లి ప్రాంతానికి చెందిన మొహమ్మద్ ముఖ్రం (42) అనే వ్యక్తి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఆటో ఛార్జీకి సంబంధించిన చిల్లర పది రూపాయల విషయంలో ఆయనకు, కొందరికి మధ్య వాగ్వాదం మొదలైంది. ఆ మాట మాట పెరిగి కాస్తా గొడవగా మారింది. ఆవేశంతో రగిలిపోయిన సదరు వ్యక్తులు ముఖ్రంపై విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితులు విషమించి కన్నుమూశారు.

సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. అజీమ్ అనే ఒక యూట్యూబర్, మరో వ్యక్తి షోయబ్ కలిసి ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో ఆధారాలు లభించాయని, వారి పాత్రపై విచారణ జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. అయితే అసలు అక్కడ ఏం జరిగింది? ఈ ఘటనలో ఎవరినైనా అరెస్ట్ చేశారా? అనే వివరాలు పోలీసులు అధికారికంగా తెలిజేయాల్సి ఉంది. ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే బహదూర్ పురా ఎమ్మెల్యే మొహమ్మద్ ముబీన్ అక్కడికి చేరుకుని, బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. "వట్టేపల్లి ప్రాంతంలో అజీమ్, షోయబ్ మరికొందరు అనుచరులు రౌడీషీటర్లుగా వ్యవహరిస్తూ గూండాగిరీ చేస్తున్నారు. ఈ ఒక్క నెలలోనే ఇదే రోడ్డుపై జరిగిన రెండో హత్య ఇది. రాజేంద్రనగర్ డీసీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వెంటనే స్పందించి నిందితులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలి. ఈ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి. బాధితుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు మేము అండగా ఉంటాం," అని ఎమ్మెల్యే ముబీన్ డిమాండ్ చేశారు.

# దానం పిటిషన్‌పై సుప్రీం విచారణ

మొదటి పేజీ తరువాయి

స్పీకర్ గడ్డం ప్రసాద్ ఈ పిటిషన్లను కొట్టివేశారు. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఈ వ్యవహారం హైకోర్టుకు వెళ్లింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు.. ఈనెల 18వ తేదీన సంచలన తీర్పును వెలువరించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. అదే సమయంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించాలని కూడా ఆదేశించింది.

హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాదులు కోరుతున్నారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఉందని దానం నాగేందర్ లాయర్ ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ప్రకటించిన నేపథ్యంలో ఉపఎన్నికకు సంబంధించిన ప్రక్రియ ముందుకు వెళ్లే అవకాశం ఉందని ఆయన వాదించారు. అందువల్ల పిటిషన్‌ను త్వరగా విచారించాలని కోరారు.

దానం నాగేందర్ పిటిషన్‌ను వెంటనే విచారించాలన్న అభ్యర్థనను ప్రతివాదుల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాదులు ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. తమ వాదనలు వినకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవద్దని వారు కోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం సుప్రీంకోర్టు బుధవారం పిటిషన్‌ను విచారించనున్నట్లు స్పష్టం చేసింది.

మరోవైపు.. పోరాటం తనకు కొత్తేమీ కాదన్న దానం నాగేందర్.. ఒకవేళ ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యం అయితే పోటీ చేసి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు తర్వాత తాను సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని చెప్పిన దానం.. తానొక ఫైటర్ అని.. పోరాడాలని ఆయన సూచించినట్లు తెలిపారు.

# దసరా నుంచి 100 శాతం ట్యాక్స్ ఫ్రీ

**న్యూస్ డెస్క్, 21 సెప్టెంబరు (తెలుగు గళం):** భారత్-న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ) 2026 అక్టోబర్ 20 నుంచి అమల్లోకి రానుంది. విజయదశమి సందర్భంగా ఈ ఒప్పందం అమల్లోకి వస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం తెలిపారు. న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్లేతో సోమవారం న్యూఢిల్లీలో వర్చువల్ సమావేశం నిర్వహించిన సందర్భంగా గోయల్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రకటిస్తూ రెండు దేశాలకు ఒక విజయం అని ఎక్స్ లో పోస్టు చేశారు.


ఎఫ్టీఏ అమల్లోకి వచ్చిన రోజు నుంచే భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి చేసే 100 శాతం ఉత్పత్తులకు సుంకం లేని ప్రవేశం లభించనుంది. ఈ ఒప్పందం రెండు దేశాల ఆర్థిక భాగస్వామ్యంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. భారత్-న్యూజిలాండ్ మధ్య ఆర్థిక సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత ఊపందుకున్నాయని తెలిపారు. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ భారత్ పర్యటన, ప్రధాని నరేంద్ర మోడీ 2026 జూలైలో న్యూజిలాండ్ పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ప్రోత్సాహం లభించిందన్నారు. మోడీ పర్యటన నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధానమంత్రి చేసిన తొలి పర్యటనగా నిలిచిందని తెలిపారు. 2030 రోడ్‌మ్యాప్‌లో భాగంగా వచ్చే నాలుగైదేళ్లలో వస్తు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని దాదాపు రూ.35 వేల కోట్లకు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భారత్-న్యూజిలాండ్ ఎఫ్టీఏ పై 2026 ఏప్రిల్ 27న న్యూఢిల్లీలో సంతకాలు జరిగాయి. కేవలం తొమ్మిది నెలల్లోనే చర్చలు పూర్తయ్యాయి.

### వరంగల్‌లో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో

# ఘనంగా ప్రపంచ శాంతి దినోత్సవం

## "మూడవ ప్రపంచ యుద్ధాన్ని ఆపండి" అంటూ శాంతి సందేశం

**తెలుగు గళం న్యూస్ వరంగల్, సెప్టెంబర్ 21**







ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని జమాఅత్ అహ్మదీయ్యా ముస్లిం కమ్యూనిటీ వరంగల్ నగరం ఆధ్వర్యంలో శాంతి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.నాయుడు పెట్రోల్ పంప్ ప్రాంతంలోని ఆర్టీఏ సర్కిల్ వద్ద కమ్యూనిటీ సభ్యులు గంటపాటు ప్లకార్డులు, ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ప్రపంచ శాంతి, మానవ సమాజంలో ఐక్యత, సామరస్యత, సోదరభావం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేశారు.ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో యుద్ధాలు, ఘర్షణలు, హింస, ఆయుధ పోటీలు కొనసాగుతున్న నేపథ్యంలో శాంతి, న్యాయం, పరస్పర గౌరవం, మానవతా విలువల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు."మూడవ ప్రపంచ యుద్ధాన్ని ఆపండి" అనే శాంతి సందేశాన్ని ప్లకార్డులు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు అందించారు.దేశాలు, మతాలు, వర్గాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం, సహనం, సంభాషణల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.యుద్ధాలు, ఆయుధ పోటీలు ప్రపంచవ్యాప్తంగా సామాన్య ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని, శాంతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఐదవ ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ప్రపంచ శాంతి కోసం చేస్తున్న కృషిని నిర్వాహకులు ప్రస్తావించారు. శాంతి, న్యాయం, సమానత్వం, పరస్పర గౌరవం ఆధారంగా ప్రపంచ వ్యవస్థను నిర్మించాల్సిన అవసరాన్ని ఆయన వివిధ సందర్భాల్లో వివరిస్తున్నారని తెలిపారు. వివాదాలకు సైనిక పరిష్కారాల కంటే న్యాయం, చర్చలు, పరస్పర అవగాహన ద్వారా శాంతియుత పరిష్కారాలను అన్వేషించాలని ఆయన సందేశాలను ఉటంకించారు. కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష ఆసక్తి కనిపించింది.పలువురు విద్యార్థులు కార్యక్రమాన్ని గమనించి అక్కడ ఆగి జమాఅత్ అహ్మదీయ్యా గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.మరికొందరు కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను తీసుకున్నారు. శాంతి సందేశం పట్ల విద్యార్థులు ఆసక్తి, సానుకూల స్పందన వ్యక్తం చేయడం కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేసిందని నిర్వాహకులు తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో శాంతి కోసం కృషి చేయాలని, ద్వేషం, హింసకు దూరంగా ఉంటూ ప్రేమ, మానవత్వం, సోదరభావం, పరస్పర సహకారాన్ని పెంపొందించాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పిలుపునిచ్చారు.అల్లాహ్ తఆలా ఈ ప్రయత్నాలను స్వీకరించి సమాజంలో శాంతి, ప్రేమ, సోదరభావాన్ని వ్యాప్తి చేయడానికి సాధనంగా చేయాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు ముహమ్మద్ యాకూబ్ పాషా, స్థానిక పట్టణ శాఖ అధ్యక్షుడు ముహమ్మద్ సలీం, సర్కిల్ ఇన్‌చార్జి ఆసిఫ్ ఖాదిం, పట్టణ మిషనరీ ఇన్‌చార్జి అయాన్ పాషా, స్థానిక వయోజన సమితి అధ్యక్షుడు ఇక్బాల్, సయ్యద్ కరీం, యువజన జిల్లా అధ్యక్షుడు కబీర్ పాషా, రఫీ, హమీద్, వలీపాష, బషీర్, అక్బర్, జీషాన్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు

### పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో

# వినాయక మండపం వద్ద అన్నదానం

**తెలుగు గళం న్యూస్ జఫర్గడ్ సెప్టెంబర్ 21**



జఫర్గడ్ మండల కేంద్రంలోని హనుమాన్ గుడి వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన గోషికొండ కల్పన--రత్నాకర్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా వినాయకుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బైరీ నర్సింగం, ఈరబత్తిని అంజయ్య, బైరీ వెంకటేశ్వర్లు, మామిడాల సోమనారాయణతో పాటు పలువురు భక్తులు, పద్మశాలి సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నిర్వాహకులు, సంఘం సభ్యులు సహకరించారు.

# ఎంజీఎం పైకప్పు పెచ్చులు కూలి రోగులకు ప్రాణాపాయం

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం: సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య



**తెలుగు గళం న్యూస్ వరంగల్, సెప్టెంబర్ 21**

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో శిథిలావస్థకు చేరిన ఆరోగ్యశ్రీ వార్డు భవనం పైకప్పు పెచ్చులు కూలి పక్షవాతంతో చికిత్స పొందుతున్న ముగ్గురు రోగులపై పడిన ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య అన్నారు.రోగులను ప్రాణాపాయ స్థితిలోకి నెట్టిన ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆసుపత్రి భవనాల భద్రతపై సమగ్ర పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు.సోమవారం ఎస్ఆర్ నగర్‌లోని రఘునాథ్ భవన్‌లో సీపీఎం ఖిలా వరంగల్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల కమిటీ సభ్యులు ఎన్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు ఎన్. రత్నమాల పాల్గొన్నారు.ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్న ఎంజీఎం ఆసుపత్రికి తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు చికిత్స కోసం వస్తుంటారని తెలిపారు. అలాంటి కీలకమైన ఆసుపత్రిలో భవనాలు శిథిలావస్థకు చేరడం, పైకప్పు పెచ్చులు కూలి రోగులపై పడటం ఆందోళనకరమన్నారు.ఆరోగ్యశ్రీ వార్డులో జరిగిన ఘటనలో మస్తాన్, ఎల్లమ్మ, ఓంకార్ అనే ముగ్గురు పక్షవాత రోగులపై పైకప్పు పెచ్చులు పడటంతో వారు తీవ్ర ప్రమాదానికి గురయ్యారని తెలిపారు.ఆసుపత్రి భవనాల నిర్వహణ, భద్రతపై అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ సమస్యపై స్పందించి ఆసుపత్రి పరిస్థితులను పరిశీలించాలని రంగయ్య కోరారు. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని ఎంజీఎం ఆరోగ్యశ్రీ భవనానికి అవసరమైన నిధులు కేటాయించి పటిష్టంగా మరమ్మతులు లేదా పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రోగుల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీ. దుర్గయ్య, కేవీపీఎస్ జిల్లా నాయకుడు యు. కుమార్, ఆవుల ఉదయ్, ఏరియా కమిటీ సభ్యులు ఎం. జ్యోతి, జరిన, పి. రాధక్క తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

## మహిళల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి: సింగారపు రమేష్



**తెలుగు గళం న్యూస్ జనగామ, సెప్టెంబర్ 21**

జనగామ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ ఆస్పత్రులపై అధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేష్ డిమాండ్ చేశారు.సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం జనగామ కలెక్టరేట్‌కు చేరుకుని ఏవో సూపరింటెండెంట్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జనగామ జిల్లాకు సమీపంలోని యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల పరిధిలోని ప్రజలు కూడా వైద్యం కోసం జనగామకు వస్తున్నారని తెలిపారు.ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవసరమైన మౌలిక వసతులు, ప్రయోగశాలలు, ఆపరేషన్ థియేటర్లు, నిపుణులైన వైద్య సిబ్బంది వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకపోయినా చికిత్సలు, ఆపరేషన్లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా శస్త్రచికిత్సలకు ముందు మత్తు మందులు ఎవరు ఇస్తున్నారు, ఆపరేషన్‌ను ఏ వైద్యుడు నిర్వహిస్తున్నారు వంటి వివరాలపై రోగుల కుటుంబాలకు స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు.అమాయక ప్రజల నుంచి అధిక మొత్తంలో వైద్య ఖర్చులు వసూలు చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు.ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరణాలు సంభవించినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయని, అలాంటి ఘటనలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ప్రజల వైద్య అవసరాలను ఆసరాగా చేసుకుని మధ్యవర్తుల వ్యవస్థ ద్వారా వైద్య సేవలు వ్యాపారంగా మారుతున్నాయనే విమర్శలు ఉన్నాయని తెలిపారు. జనగామ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనల అమలు, వైద్య సిబ్బంది అర్హతలు, ఆపరేషన్ థియేటర్ల నిర్వహణ, ల్యాబొరేటరీలు, అత్యవసర వైద్య సదుపాయాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరారు.నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిట్యాల సోమన్న, ఉపాధ్యక్షులు పోతుకునూరి ఉపేందర్, గోసంగి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధికి రూ.1,600 కోట్ల పనులు





## కాంగ్రెస్ కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలి -ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**తెలుగు గళం న్యూస్ ధర్మసాగర్/స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 21**

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ధర్మసాగర్ మండలంలోని సుష్మిత గార్డెన్‌లో నూతన మండల, గ్రామ కాంగ్రెస్ కమిటీల పరిచయ కార్యక్రమంలో కడియం కావ్య, కడియం శ్రీహరి పాల్గొన్నారు.అంతకుముందు ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.అనంతరం స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని ఎస్ కన్వెన్షన్‌లో పట్టణ, వార్డు, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం, పట్టణ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 100 పడకల ఆసుపత్రి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తదితర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కడియం శ్రీహరి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**ఎంపీ నిధులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ**

తన ఎంపీ నిధుల వినియోగంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కడియం కావ్య ఆరోపించారు.తనకు ఇప్పటివరకు వచ్చిన రూ.14.70 కోట్ల ఎంపీ నిధుల్లో దాదాపు రూ.12 కోట్లకు పైగా వివిధ అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన అనంతరం టెండర్లు, పనుల ప్రారంభం, నిర్మాణ పురోగతి వంటి అంశాలను సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తారని వివరించారు. నిధులు కేటాయింపు, పనుల పూర్తిని ఒకటిగా చూపిస్తూ విమర్శలు చేయడం సరికాదన్నారు.వరంగల్ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను కలిసి వివిధ ప్రతిపాదనలు అందిస్తున్నామని, రైల్వేలు, జాతీయ రహదారులు, విద్య, కాకతీయ యూనివర్సిటీ, మామునూరు విమానాశ్రయం, టెక్స్‌టైల్ పార్కు, రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ తదితర అంశాలపై కేంద్ర స్థాయిలో కృషి చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు.

**ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా మార్చాం: కడియం శ్రీహరి**

స్టేషన్ ఘన్‌పూర్ పట్టణాన్ని మున్సిపాలిటీగా చేస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మున్సిపాలిటీగా ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయించామని, త్వరలో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి మరో రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.మున్సిపాలిటీలో ప్రతి వార్డుకు రూ.15 లక్షల అభివృద్ధి నిధులు, 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ కుడి కాలువకు మరమ్మతులు చేపట్టి మున్సిపాలిటీ పరిధిలోని రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.నియోజకవర్గంలో గతంలో నిలిచిపోయిన అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని, ప్రస్తుతం సుమారు రూ.1,600 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందులో రూ.45.50 కోట్లతో 100 పడకల ఆసుపత్రి, రూ.26 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.6.10 కోట్లతో డిగ్రీ కళాశాల, సుమారు రూ.400 కోట్లతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ హ్యామ్ రోడ్ల అభివృద్ధి వంటి పనులు ఉన్నాయని వివరించారు.

**బీఆర్ఎస్, బీజేపీలపై విమర్శలు**

బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని కడియం శ్రీహరి ఆరోపించారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించడం లేదని, రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు. రాజ్యాంగ సవరణల ద్వారా రాష్ట్రాల హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆస్తులు కూడబెట్టిందని కడియం శ్రీహరి ఆరోపించారు.తెలంగాణ ఉద్యమకారులపై నిజంగా ప్రేమ ఉంటే బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన నిధులను ఉద్యమకారుల సంక్షేమానికి వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై సంబంధిత వర్గాల స్పందన వెల్లడికావాల్సి ఉంది.మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై కూడా కడియం శ్రీహరి తీవ్ర విమర్శలు చేశారు.రాజకీయాల్లో తనపై వ్యక్తిగతంగా, స్థాయికి మించి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. రాజయ్య వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆయనపై విమర్శలు గుప్పించారు.

**కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పిలుపు**

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని కడియం శ్రీహరి, కడియం కావ్య పార్టీ శ్రేణులకు సూచించారు. అంతర్గత అభిప్రాయభేదాలను పక్కనపెట్టి కుటుంబ సభ్యుల్లా ఐక్యంగా పనిచేయాలని కోరారు.రాబోయే రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, నూతన కమిటీ సభ్యులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఘంటసాలలో 'మూడో ప్రపంచ యుద్ధాన్ని ఆపండి' శాంతి ప్రచారం



తెలుగు గళం న్యూస్ విజయవాడ/ఘంటసాల, సెప్టెంబర్ 21

ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా అహ్మదీయ ముస్లిం జమాఅత్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం ఘంటసాలలో 'మూడో ప్రపంచ యుద్ధాన్ని ఆపండి' అనే నినాదంతో శాంతి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధాలు, ఉద్రిక్తతల వల్ల మానవాళికి ఎదురయ్యే విపత్కర పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజా సంబంధాల ప్రతినిధి మొహమ్మద్ జావిద్ మాట్లాడుతూ..యుద్ధాల వల్ల అత్యధికంగా నష్టపోయేది అమాయక ప్రజలు, చిన్నారులు, మహిళలు, భవిష్యత్ తరాలేనని అహ్మదీయ ముస్లిం జమాఅత్ అధినేత హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ హెచ్చరించారని తెలిపారు. ప్రపంచంలో శాశ్వత శాంతి నెలకొల్పాలంటే యుద్ధం, హింసకు బదులుగా న్యాయం, సహనం, పరస్పర గౌరవం, దౌత్యం, చర్చల మార్గాన్ని అనుసరించాలని ఆయన పిలుపునిచ్చారని పేర్కొన్నారు.మూడో ప్రపంచ యుద్ధం సంభవించే పరిస్థితులు ఏర్పడితే, ముఖ్యంగా అణ్వాయుధాల వినియోగం వల్ల మానవాళికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మిర్జా మస్రూర్ అహ్మద్ ప్రపంచ నాయకులను హెచ్చరిస్తున్నారని తెలిపారు. వివాదాలను యుద్ధాల ద్వారా కాకుండా న్యాయం, దౌత్యం, పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచిస్తున్నారని చెప్పారు.ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని జమాఅత్ కృష్ణాజిల్లా ఇన్‌చార్జి యాకుబ్ పాషా పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ప్రేమ, సోదరభావం, పరస్పర అవగాహన పెంపొందించడం ద్వారా శాంతియుత సమాజాన్ని నిర్మించవచ్చని ఘంటసాల మసీదు గురువు ముహమ్మద్ ఇస్మాయిల్ అన్నారు.'అందరినీ ప్రేమించు--ఎవ్వరినీ ద్వేషించకు' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇస్లాం మానవ సేవ, శాంతి, న్యాయం, సోదరభావాన్ని బోధిస్తుందని, ప్రపంచాన్ని విధ్వంసం నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో




శాంతి కోసం కృషి చేయాలని జమాఅత్ కృష్ణాజిల్లా మాజీ అధ్యక్షులు షేక్ ఖాసిం సాహెబ్ పిలుపునిచ్చారు.ఈ ప్రచారంలో భాగంగా ప్రజలకు శాంతి సందేశాన్ని అందిస్తూ యుద్ధాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు.ప్రపంచ శాంతి, మానవత్వం, సోదరభావం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని నిర్వాహకులు కోరారు.కార్యక్రమంలో అహ్మదీయ ముస్లిం జమాఅత్ కృష్ణాజిల్లా మాజీ అధ్యక్షులు షేక్ ఖాసిం సాహెబ్, ఘంటసాల మసీదు గురువు ఇస్మాయిల్, బాబావలి, కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.'మూడో ప్రపంచ యుద్ధాన్ని ఆపండి' అనే శాంతి సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్వాహకులు కోరారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక..





సత్తుపల్లి/తల్లాడ,సెప్టెంబర్21(తెలుగు గళం) న్యూస్:

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తల్లాడ మండల కమిటీ ఎన్నుకొన్నారు. ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ఎస్ రెడ్డి, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. తల్లాడ మండలం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బోడ శ్రీను, కోడూరు వీరకృష్ణ, కార్యదర్శిగా దిరిశాల వీరభద్రం, కోశాధికారిగా తేల్లాపుట్ట వెంకటనారాయణ, సహయ కార్యదర్శిగా షేక్. మేహారాజ్ లను ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా రావుల గోపి గౌడ్, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జిలుగా నారపోగు ప్రసాద్, చిత్తలూరి రమేష్ లను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల నూతన కమిటీ తెలంగాణ ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో: నాయకులు మోదుగు రవికుమార్, ఎక్కిరాల బాబు, ఆంజనేయులు, తేలపుట్ట వెంకటేశ్వర్లు, లాలయ్య, ప్రసన్నకుమార్, రేగళ్ల శ్రీనివాసరావు, భూక్య ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# చినూరు వెంకటయ్య మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

**-సారంపల్లి వాసుదేవరెడ్డి**

**బాధిత కుటుంబాలను పరామర్శించిన సీపీఎం నేతలు**

తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్, సెప్టెంబర్ 21

జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ చినూరు వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల సీపీఎం నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.చినూరు వెంకటయ్య కుటుంబ సభ్యులను సీపీఎం ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి సారంపల్లి వాసుదేవరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, రాపర్తి సోమయ్య, మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.డి. షబానా తదితరులు పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా సారంపల్లి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. కామ్రేడ్ వెంకటయ్య సీపీఎం ఉద్యమంతో సుదీర్ఘకాలం అనుబంధం కలిగి, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. పేదలు, కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచిన నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు.సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం సాగిన పోరాటాల్లో వెంకటయ్య అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన మరణం సీపీఎంకు మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమాలకు కూడా తీరని లోటని అన్నారు.పార్టీ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, ప్రజా సమస్యలపై పోరాటాల పట్ల ఉన్న అంకితభావం ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని తెలిపారు.వెంకటయ్య ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై మరింత బలమైన పోరాటాలు నిర్వహించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఎం నాయకులు పేర్కొన్నారు.విషాద సమయంలో వెంకటయ్య కుటుంబానికి సీపీఎం అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించేందుకు పార్టీ శ్రేణులు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయని తెలిపారు.అదేవిధంగా జఫర్‌గడ్ మండలం దుర్గ్యా తండాకు



చెందిన భూక్య శ్రీనివాస్ మృతి చెందడంతో ఆయన సోదరుడు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందునాయక్‌తో పాటు కుటుంబ సభ్యులను సీపీఎం నాయకులు పరామర్శించి ఓదార్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం తమ్మడపల్లి (జి) గ్రామ కార్యదర్శి వేల్పుల రవి, మండల కమిటీ సభ్యులు నక్క యాకయ్య, గ్రామ నాయకులు వడ్లకొండ రాజు, ఎం.డి. షంషోద్దీన్, కే. రఘుపతి, నక్క దేవేందర్, కే. అంజయ్య, ఎన్. వేణు తదితరులు పాల్గొన్నారు.

# హిందీ టీచర్‌ను వెంటనే నియమించాలి

**చిరుతపల్లి-2 ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఇబ్బందులు**

**ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేసిన**

**సర్పంచ్ నల్లెబోయిన ఆదిలక్ష్మి**





తెలుగు గళం వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 21:

ములుగు జిల్లా వెంకటాపురం మండలం బర్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చిరుతపల్లి-2 ఆశ్రమ పాఠశాలలో గత మూడు సంవత్సరాలుగా హిందీ ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బర్లగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ నల్లెబోయిన ఆదిలక్ష్మి తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న ఈ పాఠశాలలో హిందీ సబ్జెక్టు బోధనకు ఉపాధ్యాయుడు లేకపోవడం వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వెంకటాపురం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈఓ జి.సత్యనారాయణకు సర్పంచ్ ఆదిలక్ష్మి వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిరుతపల్లి-2 ఆశ్రమ పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడిని తక్షణమే నియమించాలని ఆమె అధికారులను కోరారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో సమర్థవంతమైన బోధన అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆనందరావు కుటుంబాన్ని తక్షణమే ఆదుకోవాలి: సండ్ర"

**పలు కుటుంబాలను పరామర్శించిన సండ్ర"**



సత్తుపల్లి/వేంసూరు,సెప్టెంబర్21(తెలుగు గళం) న్యూస్:

ఖమ్మంజిల్లా వేంసూరు మండల పరిధిలోని లచ్చన్న గూడెం గ్రామంకు చెందిన పర్సా ఆనందరావు ఇటీవల పిడుగుపాటుకు అకాల మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. శోకసంద్రంలో మునిగిన కుటుంబాన్ని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య సోమవారం పరామర్శించారు. ఆనందరావు కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన మాట్లాడుతూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఆనందరావు పిడుగుపాటుతో మృతిచెందడం అత్యంత బాధాకరమన్నారు. ముగ్గురు ఆడబిడ్డల భవిష్యత్తుకు అండగా నిలవాల్సిన సమయంలో కుటుంబ పెద్దను కోల్పోవడం కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని,అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.పిడుగుపాటుతో మృతిచెందిన పర్సా ఆనందరావు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పర్సా కృష్ణ, ఈడా వెంకటేష్ కుటుంబ సభ్యులను సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారి బాధలో తాము భాగస్వాములమని తెలిపారు.ఈ కార్యక్రమంలో: గ్రామ సర్పంచ్ పోతురాజు చక్రధరావు, మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ పోతురాజు పావల్ రాజ్, నాయకులు గొర్ల రాంమోహన్ రెడ్డి, గండ్ర సోమిరెడ్డి, ఆర్చేపల్లి కరుణప్రసాద్, గుత్తా శ్రీనివాసరావు, పగుట్ల నరసింహారావు, వీరబాబు, మేడా విజయబాబు, పగుట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# లచ్చన్నగూడెం లో పాముకాటుతో వ్యక్తి మృతి"

**పరామర్శించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్"**



సత్తుపల్లి/ వేంసూరు, సెప్టెంబర్21(తెలుగు గళం) న్యూస్ :

ఖమ్మంజిల్లా వేంసూరు మండల పరిధిలోని లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పుచ్చకాయల వీరస్వామి పాముకాటుతో మృతి చెందగా పార్థివదేహాన్ని సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తండ్రి మొక్కిన మొక్కును తీర్చుకున్న తనయుడు


**నూకల అభినవ్ రెడ్డి సారథ్యంలో... భక్తి పాదయాత్ర**

**భక్తి పాదయాత్రలో భాగంగా అభినవ్ రెడ్డితో నడుచుకుంటూ వెళ్లిన ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్**

**వందల సంఖ్యలో పాల్గొన్న నూకల అభినవ్ రెడ్డి అభిమానులు**







తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

పురుషోత్తమాయిగూడెం నుండి కురవి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం వరకు స్వర్గీయ నూకల నరేష్ రెడ్డి మొక్కిన మొక్కును వారి తనయుడు నూకల అభినవరెడ్డి మొక్కు తీర్చుకున్నారు,నూకల అభినవ్ రెడ్డి ఆధ్వర్యంలో సాగిన పవిత్ర భక్తి పాదయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్,డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్,ఈ సందర్భంగా నూకల అభినవ్ రెడ్డి మాట్లాడుతూ కురవి వీరభద్రస్వామి ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తుల విశ్వాసంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది అన్నారు,తరతరాలుగా ఈ ప్రాంత ప్రజలు స్వామివారిని ఆరాధ్యదైవంగా కొలుస్తూ మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది అన్నారు,ఈ నేపథ్యంలో స్వామివారికి పలు సందర్భాల్లో మొక్కుకున్న ఆయన,వాటిని చెల్లించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో ఆ మొక్కులు అసంపూర్తిగా మిగిలాయి అన్నారు, ఈ మొక్కను తీర్చుకునే క్రమంలో గ్రామం నుండి పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నాం అన్నారు, డోర్నకల్ నియోజకవర్గం లోని ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని,పాడి పంటలతో సల్లగా జీవించాలని ఆ కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామిని వేడుకున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,మరిపెడ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు బానోతు రామ్లాల్ నాయక్, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్,జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్ రెడ్డి,కురవి దేవస్థాన కమిటీ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి,మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్,మెంచు అశోక్ కుమార్ గౌడ్, షేక్ తాజుద్దీన్,కురవి మండల పార్టీ అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్ గౌడ్,మాజీ జెడ్పిటిసి అంబటి వీరభద్రం గౌడ్,ఎల్ హెచ్ పి ఎస్ భీమా నాయక్,కౌన్సిలర్ గంట్ల గౌతమ్ రెడ్డి,జాటోత్ సురేష్ నాయక్,వంటికొమ్ము హితేష్ రెడ్డి,గుండగని సుందర్ గౌడ్,బాబురావు గౌడ్,గుండగని నరేష్ గౌడ్,తమ్మనబోయిన ఉమేష్,ఉడుగుల రాజు,యూత్ నాయకులు విజయ్, డోర్నకల్ నియోజకవర్గం లోని వివిధ మండలాల మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,కార్యదర్శులు సర్పంచులు,ఉప సర్పంచులు,కాంగ్రెస్ కార్యకర్తలు,నూకల అభినవ రెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడికి ప్రతేక పూజలు చేసిన ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లిగోరి

మండల కేంద్రంలోని సదాశివాలయంలో ఛాలెంజ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని స్థానిక ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావంతో పాటు సమాజంలో సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. ఉత్సవాలను సోదరభావంతో నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందిస్తూ,ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూదనబోయిన ఓంప్రకాష్,ఆలయ చైర్మన్ కట్ల కోటి,కారోబార్ కట్ల నాగరాజు,ఛాలెంజ్ యూత్ అధ్యక్షుడు సాదు తిరుపతి,ప్రధాన కార్యదర్శి దోమల రాజ్‌కుమార్,పూజారి నంది విజయ్,గ్రామ పెద్దలు కట్ల ప్రకాష్,ఓమాజీ,సింగరబోయిన సుదర్శన్,వైనాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.